క్లుప్తంగా

వృద్ధాశ్రమంలో అన్నసంతర్పణ



సత్తెనపల్లి: పట్టణంలోని ఆదరణ అనాధ వృద్ధాశ్రమంలో వ్యాపారవేత్త పుసులూరి చిన్నికృష్ణ అన్నసంతర్పణ చేపట్టారు. తన కుమారుడు వరుణ తేజ పుట్టిన రోజు సందర్భంగా ఆదివారం భోజనాలు పెట్టారు. దాతలకు ఆశ్రమ నిర్వాహకులు కె.ఇంద్రసేన, కె.రిషితలు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కుటుంబ సభ్యులు పుసులూరి.శివప్రసాద్, పుసులూరి అంజనాదేవి, పుసులూరి వెంకట లక్ష్మి, రోహిత్, తదితరులు ఉన్నారు.

అంకితభావానికి స్ఫూర్తి..మదర్ థెరీసా



సత్తెనపల్లి: సేవ అంకితభావం కలిగిన నర్సులకు మదర్ థెరీసా స్ఫూర్తి ప్రదాత అని వేద నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ మామిడి మాలతీ అన్నారు. జాతీయ నర్సుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం కేక్ కట్ చేసి విద్యార్థినిలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారిని తమ వారిగా భావించి సేవలందించే నర్సుల ఔన్నత్యం ఎనలేనిదన్నారు. కార్యక్రమం లో మహిళ అకాడమిక్ డైరెక్టర్ చింతాడ లలితా సృజన, కళాశాల అధ్యాపకులు అనూష, ప్రియా, తదితరులు పాల్గొన్నారు.

బైక్ నుంచి పడి వ్యక్తి మృతి

దాచేపల్లి : ద్విచక్ర వాహ నం జారిపడి వ్యక్తి మృతి చెందిన ఘటన శనివారం రాత్రి జరిగింది. మృతుడు గురజాల మండలం బుధవాడ గ్రామానికి చెందిన దాసరి బ్రహ్మయ్య(32)గా గుర్తించారు. ఎస్ఐ జి.సంధ్యారాణి వివరాల మేరకు.. గురజాలలో నివాసం ఉంటున్న బ్రహ్మయ్య ఓ పార్టీ ప్రచార కార్యక్రమం నిమిత్తం స్వగ్రామమైన బుధవాడకి వచ్చాడు. ప్రచారం ముగించుకుని ఇంటికి వెళ్తతున్న క్రమంలో నడికుడి రైల్వేస్టేషన్ సమీపంలోని ద్విచక్రవాహనంపై నుంచి జారి పక్కనే ఉన్న క్వారీ గుంతల్లో పడ్డాడు. బలమైన గాయాలు కావటంతో బ్రహ్మయ్య అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఆదివారం మృతదేహాన్ని పరిశీలించారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం గురజాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుడికి భార్య, మూడు సంవత్సరాల కుమారుడు ఉన్నారు..

తాటికాయలు కోసే విషయంలో వివాదం

నలుగురికి గాయాలు

పెదకాకాని: తాటికాయలు కోసే విషయంలో ఇరుగ్రామాల మధ్య చోటు చేసుకున్న వివాదం ఘర్షణకు దారి తీసింది. పెదకాకాని మండలంలోని కొప్పురావూరు గ్రామానికి చెందిన మేకల అశోక్ గత కొంతకాలంగా తాటి ముంజలు విక్రయిస్తున్నాడు. తాటి కాయలు కోసేందుకు ఆదివారం మరో ముగ్గురితో కలసి కొప్పరావూరు గ్రామ శివారు ప్రాంతంలోని కంతేరు వెళ్లగా కొందరు టీడీపీకి చెందిన వారు అక్కడికి చేరుకున్నారు. ఇరువురి మధ్య వివాదం చోటు చేసుకుంది. వెంటనే కంతేరు గ్రామంలోని స్నేహితులను మరికొంత మందిని ఫోన్ చేసి పిలిపించారు. ఈ సందర్భంగా ఇరువురి మధ్య చోటు చేసుకున్న వివాదం ఘర్షణకు దారి తీసింది. కొప్పురావూరు గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ యువకులపై రాళ్ళు, సీసా పెంకులతో దాడి చేశారు. దాడి చేసిన వారిలో కంతేరు గ్రామ టీడీపీ అధ్యక్షుడు, యువత ఉన్నట్లు బాధితులు తమ ఫిర్యాదులో పేర్కొన్నారు. గాయపడిన వారిలో మేకల అశోక్, విజయ్, కొమ్ము రమేష్, బుల్లా దిలీప్, బలిజేపల్లి ప్రశాంత్‌కుమార్ ఉన్నారు. సంఘటనా స్థలానికి తాడికొండ పోలీసులు చేరుకుని దర్యాప్తు చేపట్టారు.

పోలీసు బందోబస్తు పటిష్టం

శావల్యాపురం: నేడు జరిగే సార్వత్రిక ఎన్నికల సందర్భంగా పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు వినుకొండ రూరల్ సీఐ ఉప్పుటూరి సుధాకర్ ఆదివారం తెలిపారు. స్థానిక పోలీసు స్టేషను సీఐ మాట్లాడుతూ రూరల్ పరిధిలో నాలుగు మండలాలు ఉండ గా అన్నీ పోలింగ్ కేంద్రాల పరిధిలో కేంద్ర బలగాలు కాకుండా ఆదనంగా 1000 మంది పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. ఒక్కో మండలానికి కేంద్ర బలగాలు కాకుండా 200 మంది పోలీసులను కేటాయించామన్నా రు. ప్రతి పోలింగ్ కేంద్రం పరిధిలో సీసీ కెమెరాలతో పాటు పోలీసు బందోబస్తు నడుమ స్వేచ్ఛాయుత వాతావరణంలో ప్రతి ఒక్కరు ఓటు వినియోగించుకునేలా చర్యలు తీసుకున్నామన్నారు. ప్రజాప్రతినిధులు సంయమనం పాటించాలని ఎన్నికల నియమావళి అతిక్రమిస్తే అటువంటి వారి పై చట్టపరంగా కేసులు నమోదు చేస్తామన్నా రు.

శ్రీరస్తు..శుభమస్తు ..ఆరోగ్యమస్తు

- సీహెచ్‌సీ, పీహెచ్‌సీలకు మహర్దశ
- రూ. 23 కోట్లతో నూతన భవనాలు, సౌకర్యాలు
- పూర్తిస్థాయిలో సిబ్బంది నియామకం
- ఉచితంగా 68 రకాల పరీక్షలు, 168రకాల మందులు
- అత్యాధునిక యంత్రాలతో ల్యాబ్‌ల ఏర్పాటు
- నెలకు 25వేలమందికి వైద్యచికిత్సలు
- గ్రామానికి నెలకు రెండు సార్లు 104సంచార వైద్యశాల



అమరావతి కమ్యూనిటీ హెల్త్ సెంటర్ నూతనభవనం



ఫ్యామిలీ డాక్టర్ విధానంలో రోగులకు సేవలు అందిస్తున్న దృశ్యం

అమరావతి: వైద్యులు, మందులు, సిబ్బంది కొరతతో పర్యవేక్షణ కరువైన ప్రభుత్వ వైద్య రంగం ఇప్పుడు కళకళలాడుతోంది. పేదవాడి ఆరోగ్యానికి భరోసానిచ్చేలా ఆసుపత్రులు అండగా నిలుస్తున్నాయి. అవసానదశలో ఉన్న పిహెచ్‌సి,సిహెచ్‌సిలకు నిధులు కేటాయించి, సిబ్బంది నియామకాలను భర్తీ చేస్తూ అసుపత్రులకు జవసత్వాలు కల్పించారు. పెదకూరపాడు నియోజకవర్గంలో ఐదేళ్లలో సర్కారు దవాఖానాల రూపురేఖలే మారిపోయాయి. నియోజవర్గంలో ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలు, కమ్యూనిటి హెల్త్‌సెంటర్లలో సుమారు నాలుగు లక్షల మందికి పైగా జనాబాకు వైద్యసేవలు అందించేందుకు కోట్ల రూపాయల నిదులను ప్రభుత్వం వెచ్చించింది. గతంలో తీవ్ర నిర్లక్ష్యానికి గురై నామమాత్రంగా వైద్య సేవలందించే ప్రభుత్వ వైద్యశాలలు ఇప్పుడు కార్పొరేట్ కు తలదన్నేలా తలపిస్తున్నాయి.

24 గంటల వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయి. పల్నాడు జిల్లాలో అసుపత్రుల ఆదునికీకరణకు రూ. 50కోట్లు కేటాయించగా అందులో రూ. 23 కోట్ల రూపాయలు పెదకూరపాడు నియోజకవర్గానికి మంజూరు చేశారు.



మండలంలో వైద్యసేవలు అందిస్తున్న 104సంచార వాహనం

అధునాతన సౌకర్యాలు–ఆధునిక భవనాలు

పెదకూరపాడు నియోజకవర్గంలో శిధిలావస్థకు చేరిన అస్పత్రుల భవనాలను అనతికాలంలో ప్రభుత్వం అత్యాధునిక హంగులను సమకూర్చింది. రూ.23 కోట్లరూపాయలతో ల్యాబ్, వైద్యుల గదులు, ఫార్మసీ గది, ఆపరేషన్ థియేటర్, వార్డులు, సమావేశమందిరాలు ఇలా అత్యాధునిక సౌకర్యాలతో నిర్మాణాలు చేపట్టారు. కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లలో రోగులకు కావలసిన అన్ని సౌకర్యాలను సమకూర్చారు. ల్యాబ్, ఎక్సరే, ఆపరేషన్ థియేటర్, ఆడ,మగ, పిల్లల వార్డులు వంటి సౌకర్యాలు ఉన్నాయి. ఆరోగ్యమిత్ర, అస్పత్రి సిబ్బందికి క్వార్టర్స్, వీటితో పాటు మార్చురీ, పోస్టు మార్టం సౌకర్యాలకు ఇటీవలే ప్రారంభోత్సవాలు నిర్వహించారు.

అభివృద్ధికి నోచుకున్న ఆసుపత్రులివీ..

పెదకూరపాడు 30 పడకల ఆస్పత్రి రూ.8.5 కోట్లు అచ్చంపేట ఆస్పత్రికి రూ. 2.5 కోట్లు, దొడ్లేరు ఆస్పత్రి రూ.2.5 కోట్లు, చింతపల్లి ఆస్పత్రిని రూ.2.5 కోట్లతో, అత్తలూరు పిహెచ్‌సిని 2.5కోట్లు, అమరావతిని సిహెచ్‌సికి 3.5కోట్ల రూపాయలతో అభివృద్ధి చేశారు.

పూర్తిస్థాయిలో సిబ్బంది నియామకం

పీహెచ్ సీల పరిధిలో రెండు మూడు గ్రామాలకు కలిపి ఒక ఏఎన్ఎం విధులు నిర్వహించేవారు. కానీ నేడా పరిస్థితి మారింది. మండలాన్ని రెండు క్లస్టర్‌లుగా విభజించి ఒక్కో క్లస్టర్‌కు ఇద్దరు నిపుణులైన వైద్యులతో పాటు, లోపాలను పర్యవేక్షించి సరిదిద్దటానికి క్లస్టర్‌కు నలుగురు చొప్పున పర్యవేక్షాధికారులను నియమించారు. మండలంలో ఉన్న అన్ని గ్రామాలకు ఎఎన్ఎంలను అలాగే వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లలో పనిచేయటానికి బీఎస్సీ నర్సింగ్ చదివిన 15మంది ఎంఎల్‌హెచ్‌పిలను నియమించారు. వీరితో పాటు మండలంలో అన్ని గ్రామాల్లో ఆశ కార్యకర్తలు పని చేస్తున్నారు. కమ్యూనిటి హెల్త్‌సెంటర్లో గతంలో ఒకరులేదా ఇద్దరు డాక్టర్లు ఉండే పరిస్థితి నుంచి ఏడుగురు డాక్టర్‌లతో పాటు కాంటాక్టుపద్ధతిలో మరో డాక్టరు ప్రజలకు వైద్యసేవలు అందిస్తున్నారు. ఈ ఐదేళ్ళలో నెలకు 7500నుండి 9000 మంది రోగులకు వైద్యసేవలు అందించే స్థాయికి పెరిగింది. ప్రతిరోజు 300కుపైగా ఓపి పేషెంట్లకు,25నుంచి 28మంది ఇన్‌పేషెంట్లకు వైద్య సేవలు అందిస్తున్నారు.



అత్తలూరు పిహెచ్‌సి నూతనభవనం

అత్యాధునిక ల్యాబ్ సౌకర్యం



పిహెచ్‌సిలో ఏర్పాటు చేసిన ల్యాబ్

రోగనిర్ధారణ పరీక్ష యంత్రాలతో పరీక్షలు చేయటానికి నిపుణులైన ల్యాబ్ టెక్నీషియన్‌లను నియమించారు. ఈయంత్రాల ద్వారా అతిముఖ్యమైన షుగర్, సీరంక్రియాటిన్, పొటాషియం, బైలుర్‌బిఎన్, బ్లడ్ యూరియా, కొలస్ట్రాల్, యూరిక్ యాసిడ్, హెమలైడ్స్, ఎలక్ట్రో లై ట్స్, సోడియం పరీక్షలే కాకుండా మరో 58రోగ నిర్ధారణ పరీక్షలు చేస్తారు. ఎక్స్‌రే, ఈసీజీ, కిడ్నీ,, కాలేయ పరీక్షలు చేస్తారు. .ఈ అస్పత్రులలో అత్యవసరమైన పాము కాటు, కుక్కకాటు,పిల్లలకు అవసరమైన టీకాలతో పాటు సాధారణ, దీర్ఘకాలిక వ్యాధులకు అవసరమైన 168రకాల మందులు అందుబాటులోకి వచ్చాయి.. అలాగే మధుమేహం, బీపీ, క్షయం వంటి ధీర్ఘకాలిక రోగాలబారిన పడిన వారికి నెలకు సరిపడా ఒక్కసారే మందులు ఉచితంగా పంపిణీ చేస్తున్నారు.. అస్పత్రిలో ఓపి రోగులకు అవసరమైన మందులు అందుబాటులో ఉంచారు.

ఆసుపత్రులకు ఆనందంగా వెళ్తున్నాం



గతంలో రోజుకు పది, పదిహేను మంది రోగులు మాత్రమే అత్తలూరు అస్పత్రికి వచ్చేవారు అలాగే డాక్టర్లు కూడా ఉప్పుడో వచ్చి వెళ్ళిపోయేవారు. ప్రస్తుతం ఇద్దరు డాక్టర్లు 24గంటలు ఉంటున్నారు. మాఊరితో పాటు చుట్టప్రక్కల ఊళ్ళ నుంచి రోగులు వచ్చి వైద్యం చేయించుకుంటున్నారు. పేదోళ్ల అరోగ్యం కోసం ప్రభుత్వం చేపడుతున్న కృషి అభినందనీయం.

బంకా బాబురావు, అత్తలూరు, అమరావతి మండలం

భరోసా దొరికింది



నెలకు రెండు సార్లు 104వాహనం మా ఊరుకు వస్తోంది. ఉచితంగా వైద్య పరీక్షలు చేస్తున్నారు. అవసరమైతే ఇంటికి వచ్చి మరీ వైద్యం చేస్తున్నారు. ఆసుపత్రులకు వెళ్లాలంటే పనులు మానుకోవాల్సి వచ్చేది. కానీ ఇప్పుడా పరిస్థితి మారిపోయింది. బిపి, షుగర్ ఉన్న వాళ్లకు 15రోజులకుగాని, నెలకు సరిపడా మందులు ఇస్తున్నారు. పొలాల్లో పని ముగించుకుని వచ్చి మందులు తీసుకుంటున్నాం మాలాంటి బీదలకు భరోసా దొరికింది.

దొప్పలపూడి వీరశేఖర్, నరుకుళ్ళపాడు అమరావతి మండలం

రండి..ఓటేద్దాం

- నేడే సార్వత్రిక ఎన్నికల పోలింగ్
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- బూత్‌లకు తరలివెళ్లిన ఈవీఎంలు, వీవీప్యాట్లు

నియోజకవర్గంలో ఓటర్లు, పోలింగ్ సిబ్బంది వివరాలిలా ఉన్నాయి	
మొత్తం ఓటర్లు	2,42,407
పురుషులు	1,18,400
మహిళలు	1,23,635
థర్డ్ జండర్లు	12
సర్వీసు ఓటర్లు	283
వాహనాలు (బస్సులు, ఇతర వాహనాలు)	58
వీల్‌చైర్లు	300
పోలింగ్ సిబ్బంది	1,938



క్రోసూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల నుంచి పోలింగ్ కేంద్రాలకు తరలివెళ్తున్న పోలింగ్ సిబ్బంది

సత్తెనపల్లి: సత్తెనపల్లి నియోజకవర్గంలో శాంతియుతంగా ఎన్నికలు జరిగేందుకు అధి కారులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు.. నియోజకవర్గంలోని సత్తెనపల్లి టౌన్, సత్తెనపల్లి రూరల్, ముప్పాళ్ళ, రాజుపాలెం, నకరికల్లు మండలాల్లో మొత్తం 274 పోలింగ్ కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. వీటికి 274 ఈవీఎంలు, వీవీ ప్యాట్‌లు ఏర్పాటు చేయగా అదనంగా మరో 54 ఈవీఎంలు, 54 వీవీ ప్యాట్‌లు సిద్ధంగా ఉంచారు. 31 మంది సెక్టోరియల్ అధికారులు, చెరో 304 మంది ప్రీసైడింగ్, అసిస్టెంట్ ప్రీసైడింగ్ అధికారులు, 1,259 మంది ఓపీఓలు, 8 మంది అదనపు సిబ్బంది, 27 మంది సూక్ష్మ పరిశీలకులు విధుల్లో పాల్గొంటారు. 27 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను అధికారులు గుర్తించారు. వెబ్‌కాస్టింగ్‌లో భాగంగా 172 సీసీ కెమెరాలు, 142 పోలింగ్ లొకేషన్లు ఐదుగురు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాల్ని ఏర్పాటు చేశారు. పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు ముందస్తుగానే పూర్తి చేశారు. దివ్యాంగులు, వృద్ధులకు ప్రత్యేకంగా పోలింగ్ కేంద్రాల వద్ద ర్యాంపులు ఏర్పాటు చేశారు. వృద్ధులు, వికలాంగులు ఓటు వేసేందుకు పోలింగ్ కేంద్రాలకు రావడానికి వీల్‌చైర్లు, వాహనాల్ని సిద్ధం చేశారు.

58 రూట్లలో పోలింగ్ సిబ్బంది

సత్తెనపల్లి అసెంబ్లీ నియోజకవర్గంలో మొత్తం 58 రూట్లను ఏర్పాటు చేశారు. పోలింగ్ కేంద్రంలో ప్రిసైడింగ్ అధికారితో పాటు అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారి, ఇద్దరు పోలింగ్ అధికారులు ఉంటారు. ప్రతి పోలింగ్ కేంద్ర వద్ద ఆశ వర్కర్, ఏఎన్ఎంలు విధులు నిర్వహిస్తారు. పోలింగ్ కేంద్రాల వద్ద మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు సిద్ధంగా ఉంచుతారు. పోలింగ్ కు సంబంధించిన ఏర్పాట్లపై ఆదివారం పట్టణంలోని హోలీ ఫ్యామిలీ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో సత్తెనపల్లి ఆర్డీఓ, రిటర్నింగ్ అధికారి వి. మురళీ కృష్ణ పరిశీలించారు.

నకరికల్లు : నకరికల్లు మండలంలో 17 పంచాయతీలకు 63 పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ ప్రక్రియ జరగనుంది. మొత్తం 53,435 ఓటర్లుండగా 26,835 మహిళలు, 26,598 మంది పురుషులున్నారు. సమస్యాత్మక గ్రామాల్లో ప్రత్యేక దృష్టి సారించిన పోలీసులు ఆయా ప్రాంతాల్లో అదనపు బలగాలను నియమించారు. ఎన్నికలు పూర్తయ్యే వరకు పోలింగ్‌కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని ఎస్ ఐ పి. రాంబాబు తెలిపారు. పోలింగ్‌కేంద్రాల లోపలికి సెల్‌ఫోన్‌లకు అనుమతి లేదని, పోలింగ్ సిబ్బంది, ఓటర్లు ఎన్నికల సంఘం నిబంధనలు పాటించి సహకరించాలని తహశీల్దార్ ఎల్. లక్ష్మీనారాయణ కోరారు.



నకరికల్లులోని ఉన్నతపాఠశాలలో సిద్ధం చేసిన బారికేడ్లు

క్రోసూరులో సర్వం సిద్ధం



పోలింగ్ కేంద్ర ఆవరణకు చేరుకున్న సిబ్బంది

క్రోసూరు: సోమవారం పోలింగ్ నేపథ్యంలో అన్ని పోలింగ్ కేంద్రాల్లో అధికారులు సర్వం సిద్ధం చేసారు. క్యూలైన్లు, షామియానా టెంట్లను ఏర్పాటు చేశారు.

పోలింగ్ కేంద్రాల వద్ద బూత్‌ల వివరాలు తెలుపుతూ బోర్డులను అందుబాటులో ఉంచారు. మండలంలో మొత్తం 57 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయి. కాగా 342 మంది పోలింగ్ ప్రక్రియలో విధులు నిర్వహిస్తారు.

క్రోసూరు: ఎన్నికలకు సంబంధించి సోమవారం పోలింగ్ జరగనున్న నేపథ్యంలో అధికారులు సర్వం సిద్ధం చేసారు. క్రోసూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఈవీఎం బాక్స్‌లు, సంబంధిత వీవీప్యాట్లు, ఇతర సామగ్రి ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బంది పోలింగ్‌స్టేషన్లకు తరలి వెళ్లారు. పెదకూరపాడు నియోజకవర్గంలో 266 పోలింగ్ స్టేషన్ల కు సంబంధించి ఎన్నికల విధులునిర్వహించేందుకు ఒక్కో స్టేషన్‌కు ఆరుగురుసిబ్బంది చొప్పున 1596 మందిని ఏర్పాటు చేసారు.



ఈవీఎంలు, వీవీ ప్యాట్‌లు అందుకుంటున్న ఎన్నికల యంత్రాంగం

భద్రత కట్టుదిట్టం

ఎన్నికలకు సంబంధించి పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట బద్రత ఏర్పాటు చేసినట్లు సీఐ మంగారావు తెలిపారు.క్రోసూరు మండలానికి సుమారు 100 మంది సిబ్బంది , కేంద్రబలగాలు విధులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 200 మీటర్ల దూరంలో వాహనాలు నిలిపి ఓటింగ్ కేంద్రానికి రావాలని సూచించారు. సమస్యాత్మక కేంద్రాల్లో నిఘా పెట్టినట్లు తెలిపారు. ప్రతి పోలింగ్ స్టేషన్ వద్ద సీసీకెమెరాలు ఏర్పాటు చేసినట్లు సీఐ తెలిపారు.

ముప్పాళ్ళ: ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తహసీల్దార్ సింగారావు తెలిపారు. మండలంలో మొత్తం 35,424 మంది ఓటర్లకుగాను 17,333 మంది పురుషులు, 18,090 మంది మహిళలున్నారని తెలిపారు. ఇందుకోసం మొత్తం 44 కేంద్రాల్లో పోలింగ్ జరగనుందన్నారు. పోలీస్ బందోబస్తు తో పాటు ప్రత్యేక సాయుధ దళాల పర్యవేక్షణలో ఎన్నికలు నిర్వహించనున్నామని, ప్రజలు తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని తహసీల్దార్ కోరారు.

నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి



ఎన్నికలకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. పోలింగ్ విధుల్లో పాల్గొనే యంత్రాంగానికి సామాగ్రి అందించాం. అందరూ పోలింగ్ కేంద్రాలకు చేరుకునేలా వాహనాలు ఏర్పాటు చేసి పంపాం.

–వి.మురళీకృష్ణ, రిటర్నింగ్ అధికారి, సత్తెనపల్లి

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి

చేబ్రోలు: ద్విచక్ర వాహనాన్ని కారు ఢీ కొట్టడంతో వృద్ధుడు మరణించిన సంఘటన చేబ్రోలు మండలం నారాకోడూరు శివారులో ఆదివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వట్టిచెరుకూరు మండలం ముట్లూరు గ్రామానికి చెందిన బెల్లంకొండ తిరుపతయ్య (64) గుంటూరులో నిర్మాణంలో ఉన్న పెట్రోలు బంకుకు వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. ఉదయం ముట్లూరు నుంచి తన మోపెడ్‌పై గుంటూరు వస్తుండగా నారాకోడూరు, బుడంపాడు మధ్య ఓ దాబా సెంటర్ ఎదురుగా వెనుక నుంచి వచ్చిన కారు వేగంగా ఢీ కొట్టింది. ఈ సంఘటనలో తిరుపతయ్య అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. కారు ముందుభాగంలో టీవీఎస్ వాహనం ఇరుక్కుపోయింది. ప్రమాద సంఘటనపై చేబ్రోలు ఎస్ఐ పి మహేష్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

78 పోలింగ్ కేంద్రాల్లో సీసీ కెమెరాలు

దాచేపల్లి : సార్వత్రిక ఎన్నికల పోలింగ్ సోమవారం జరగనున్న నేపథ్యంలో అధికారులు ఏర్పాట్లు చేశారు. దాచేపల్లి నగర పంచాయతీలో 37, గ్రామాల్లో 41 పోలింగ్ కేంద్రాల్లో అధికారులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఎన్నికల నిర్వహణ కోసం 390 సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. పోలింగ్ రోజున ఉదయం 5.30 గంటలకు మాక్ పోలింగ్ నిర్వహిస్తారని, ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు పోలింగ్ జరుగుతుందని తహసీల్దార్ పి. గీతావాణీ చెప్పారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా సీఐ ఎ.సురేంద్రబాబు ఆధ్వర్యంలో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు.

48 పోలింగ్‌స్టేషన్లలో వెబ్ కాస్టింగ్ ఏర్పాటుచేయండి

పోలీసు శాంతిభద్రతల పరిశీలకులు అజిత్‌సింగ్‌ను కోరిన వైఎస్సార్‌సీపీ

నరసరావుపేట: నియోజకవర్గంలోని 15 గ్రామాల్లో గల 48 పోలింగ్‌స్టేషన్లలో వెబ్‌కాస్టింగ్‌తో పాటు ప్రత్యేక సీసీ కెమోరాలు ఏర్పాటు చేయాలని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఎలక్షన్ చీఫ్ ఏజెంట్, న్యాయవాది కాకుమాను బాలహనుమంతరెడ్డి కోరారు. ఈ మేరకు శనివారం ఎన్నికల శాంతిభద్రతల పరిశీలకులు అజిత్‌సింగ్‌ను కలిసి రిప్రజంటేషన్ అందజేశారు. నియోజకవర్గంలోని నరసరావుపేట మండలంలోని యల్లమంద గ్రామంలో 231, 232, 233, 234 పోలింగ్ బూత్‌లు, ఇసప్పాలెం గ్రామంలోని 83, 84, 85, రావిపాడులోని 69, 72, 73, కేసానుపల్లిలోని 94, 95, 96బూత్‌లు, కేఎం అగ్రహారంలోని 79, 80, పమిడిపాడులోని 65, 66,67,68, పెదరెడ్డిపాలెం 81, 82, ఇక్కుర్రు 208, పట్టణంలోని బరంపేట 104, 105, 106, 107, రొంపిచర్ల మండలంలోని తుంగపాడులోని 61, 62, గోగులపాడు 41, 43, పరగటిచర్ల 18, 19, సుబ్బయ్యపాలెం 46, ముత్తనపల్లి 53, 54, కర్లకుంట 23, 25, 26, 27 బూత్‌లలో ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. లేనిపక్షంలో ఆయా ప్రాంతాల్లోని టీడీపీ వర్గీయులు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను పోలింగ్ బూత్‌ల వద్దకు రానీయకుండా భయభ్రాంతులకు గురిచేస్తారన్నారు.

శావల్యాపురంలో 34 పోలింగ్ కేంద్రాలు

శావల్యాపురం: నేడు జరగనున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మండలంలోని 34 పోలింగ్ కేంద్రాలను తహసీల్దారు నక్కాలక్ష్మి లావణ్య ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా తహసీల్దారు మాట్లాడుతూ ఎన్నికల సజావుగా జరిగేందుకు ప్రజలందరూ తమవంతు సహకారం అందించాలన్నారు. 34పోలింగ్ కేంద్రా ల్లో పోలింగ్ అధికారులు సిబ్బంది మౌలిక వసతులు తదితరవన్నీ క్షేత్రస్థాయిలో పరిశీలించామన్నారు. జిల్లా కలెక్టరు సారథ్యంలో 34 పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన పీవో, ఏపీవోలకు ఎన్నికల నియమావళి నిబంధనలు సూచనలు చేశామన్నారు. ప్రతి ఒక్కరు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. మండలంలోని 15 గ్రామ పంచాయతీల్లో 32 వేల 625 మంది ఓటర్లు ఉన్నట్లు తెలిపారు. పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు ఇబ్బందులు పడకుండా క్యూలైను పాటించే విధంగా బారికేడ్లు, ఎండ తాపం తగలకుండా ఉండేలా టెంటులు కూడా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బీఎల్‌వోలు కూడా పర్యవేక్షణ చేస్తూ విధి విధానాలు వివరించినట్లు తెలిపారు.